క్లుప్తంగా

సకలేశ్వరుని దివ్య కల్యాణోత్సవం



మోపిదేవి: మోపిదేవిలో ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామివారి దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం 10 గంటలకు వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. మధ్యాహ్నం 4 గంటలకు ప్రత్యేక వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా భక్తులు పూలు, పండ్లు, టెంకాయలు అందించి హారతులు అందుకున్నారు. అనంతరం రాత్రి స్వామివారి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రవీణ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహించిన స్వామివార్ల కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యపరీక్షలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 7, 14 డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. 7వ డివిజన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌లో, 11వ డివిజన్‌లోని షాదీఖానాలో నిర్వహించిన వైద్యశిబిరాలకు ఆయా డివిజన్లలో పలు వ్యాధులతో బాధపడే రోగులు వచ్చి వైద్యసేవలు పొందారు. శిబిరంలో రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలు వైద్యశాలల వైద్యులు శిబిరంలో భాగంగా రోగులకు పరీక్షలు చేశారు. ఈ శిబిరాలను ఆ డివిజన్ల కార్పొరేటర్లు పడమట రేవతి, కాగిత జవహర్‌లాల్ నెహ్రూ పర్యవేక్షించారు.

టిడ్కో గృహాల్లో ప్రవేశాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గోసంఘం వద్ద నిర్మించిన టిడ్కో జీ+3 గృహాల్లో లబ్ధిదారులు మంచి ముహూర్తాలు చూసుకుని గృహ ప్రవేశాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పలువురు లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. శ్రీనివాసరావు అనే లబ్ధిదారుని గృహప్రవేశ కార్యక్రమానికి నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ హాజరయ్యారు. లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి త్వరితగతిన గృహాల్లోకి రావాలని సూచించారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



చల్లపల్లి: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తహసీల్దార్ బి.ప్రమీల సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే బీఎల్‌ఓలు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. సీఐ సీహెచ్ నాగప్రసాద్ మాట్లాడుతూ చల్లపల్లి మండలంలో నాలుగు టిపికల్ పోలింగ్ లొకేషన్లు, ఎనిమిది టిపికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి బీఎల్‌ఓ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చల్లపల్లి మండలంలో వంద మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ సీహెచ్ చిన బాబు మాట్లాడుతూ ఎన్నికల నిమిత్తం ఆరు రూట్లను, ఆరుగురు సెక్టార్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీటీ కుమార్, ఇన్‌చార్జి ఆర్‌ఐ కృష్ణమోహన్, ఏఎస్‌ఓ అఖిలా పర్వీన్, ఉదయ్, నరసింహ, సెక్టార్ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామివార్లను రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉదయం 8 గంటలకు, రాత్రి 8 గంటలకు నిత్యబలిహరణ నిర్వహించారు. దారిపొడవునా భక్తులు స్వామివారికి పండ్లు, పూలు, టెంకాయలు అందించి, దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కృష్ణానదిలో మట్టి తొలగింపు

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 8వ తేదీన పెదకళ్లేపల్లి కృష్ణానదికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం నదిలో మేట వేసిన మట్టిని బుధవారం తొలగించారు. స్నాన ఘాట్స్ వద్ద భక్తులకు ఇబ్బందిగా ఉన్న మట్టిని ఆర్సీ అధికారులు పొక్లెయిన్ సాయంతో తొలగించారు.

ఏపీవోలకు సత్కారం

ఘంటసాల: ఘంటసాల మండలం ఉపాధి హామీ పథకం ఏపీవోగా పని చేస్తున్న కేవీఆర్ సురేష్ పామర్రు మండలానికి బదిలీ అయిన సందర్భంగా మండల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది బదిలీ పై వెళ్తున్న సురేష్‌ను, నూతన ఏపీవోగా వచ్చిన రాజ్‌కుమార్‌లను బుధవారం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా...

- మిచాంగ్ తుపాను బాధితులకు నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం
- తుపాను ప్రభావంతో మండలంలో 5,080 హెక్టార్లలో పంట నష్టం
- నష్టపోయిన 7,729 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- రైతుల ఖాతాల్లోకి రూ.8 కోట్లకు పైగా జమ



ఎన్.గొల్లపాలెంలో మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

కోనేరుసెంటర్: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతాంగాన్ని జగన్ ప్రభుత్వం ఆదుకుంది. నష్టపోయిన రైతుల ఖాతాల్లోకి నేరుగా పరిహారం జమ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ బటన్ నొక్కారు. సకాలంలో రైతులకు నష్టపరిహారం అందించి మరోమారు రైతు పక్షపాతిగా నిరూపించుకున్నారు.

మండలంలో పది కోట్లకు పైగా నష్టపరిహారం

బందరు మండలంలో దాదాపు 24 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగుతోంది. మిచాంగ్ తుపాను కారణంగా దాదాపు 5,092 హెక్టార్లలో పంట పూర్తిగా నష్టపోయింది. తద్వారా సుమారు 7,791 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయం, ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టం అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికారులు సంబంధిత నివేదికను ప్రభుత్వానికి సమర్పించగా ప్రభుత్వం 7791 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసింది.

మండలంలో ఇన్‌పుట్ సబ్సిడీ

గత ఏడాది డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుపాను కారణంగా వేలాది మంది రైతులు పంటలు కోల్పోయారు. తుపాను ప్రభావంతో వరి, వేరుశనగ పంటలు దాదాపు నీట మునిగిపోవటంతో దెబ్బ తిన్నాయి. నష్టపోయిన రైతుల జాబితాను సచివాలయాల్లో ఉంచి రైతుల నుంచి అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించిన అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకుని తుది జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది.

మండలంలో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు స్థానిక శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన కుమారుడు పేర్ని కిట్టు రైతులకు అన్ని విధాలా సహకరించారు. సంబంధిత అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి నివేదిక త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

మండలంలో తుపాను కారణంగా పంట నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రైతులను ఆదుకుంటామంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్న మాటకు కట్టుబడి రైతుల ఖాతాల్లో నగదును జమ చేసి మాట తప్పని మడమ తిప్పని నాయకుడిగా మరోమారు నిరూపించుకున్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా పథకాలు

- మళ్లీ సీఎంగా జగన్ ఉంటేనే సంక్షేమం
- ప్రజాదీవెన కార్యక్రమంలో పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము



చెన్నూరు గ్రామంలో పర్యటిస్తున్న ఉప్పాల రాము, హారిక

పెడన: దళారీ వ్యవస్థ లేకుండా, జన్మభూమి కమిటీలు వంటివి కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసిన మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని, అందుకు మీరంతా సహకరించాలని వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)అన్నారు. పెడన మండలం చెన్నూరు గ్రామంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలని, ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేలా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, చేయూత, కాపునేస్తం, ఆసరా వంటి ఎన్నో పథకాలను రాజకీయ పార్టీలకు అతీతంగా అందరికీ అందజేస్తున్నారని స్పష్టం చేశారు. అటువంటి సీఎంను మనం వదులుకుంటే ఆయా పథకాలు రావన్నారు. సంక్షేమ పథకాలు పొందాలంటే మీరంతా రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు.

ఆప్యాయంగా...అల్లుకుపోతున్న హారిక

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తనదైన శైలిలో భర్త ఉప్పాల రాముతో కలిసి ప్రచారం నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఒక పక్క రాము ప్రచారం చేస్తూంటే మరో పక్క హారిక కరపత్రాలను అందజేస్తూ తాతగారు, బాబాయ్ గారు, పిన్ని, పెద్దమ్మ, అమ్మమ్మ అంటూ ఆప్యాయంగా పలుకరిస్తూ జగనన్న చేస్తున్న పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. హారిక పలుకరింపులకు గ్రామస్తులు ఫిదా అవుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, పార్టీ నాయకులు రాజులపాటి అచ్చుతరావు, గరికపాటి రామానాయుడు, దావు భైరవలింగం, శింగంశెట్టి రాంబాబు, గ్రామ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఆర్‌ఏఆర్ పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్‌గా నవీన లావణ్యలత



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంఆర్‌ఏఆర్ కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్ (నూజివీడు) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నవీన లావణ్యలత నియమితులయ్యారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి ఆదేశాల మేరకు బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య శోభన్‌బాబు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బయోసైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ విభాగంలో సహ ఆచార్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న లావణ్యలత బుధవారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను రిజిస్ట్రార్ శోభన్‌బాబు, ఫైనాన్స్ ఆఫీసర్ రతన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పురపాలక శాఖ ఆర్జేడీని కలిసిన కమిషనర్



పెడన: పెడన నూతన కమిషనర్‌గా బి.వెంకటరామయ్య బాధ్యతలను స్వీకరించిన తరువాత బుధవారం రాజమహేంద్రవరంలోని ఆర్జేడీ ఎస్‌వీ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెడన పురపాలక సంఘం పన్నులు, వసూళ్లు, పరిపాలన తదితర విషయాలపై ఆర్జేడీ ఆరా తీశారు. ఆర్జేడీని కలిసిన వారిలో కమిషనర్‌తో పాటు టీపీవో వి.ఏసుబాబు, ఏఈ సీతారామాంజనేయులు ఉన్నారు.

మారనున్న రహదారుల రూపురేఖలు

- నేడు నాలుగు ప్రధాన రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన
- రోడ్ల నిర్మాణాలకు రూ.28.49 కోట్ల కేటాయింపు
- కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారికి అత్యధికంగా రూ.16.8 కోట్లు

కోడూరు: అవనిగడ్డ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, రోడ్ల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా కోడూరు, నాగాయలంక మండలాల్లో నాలుగు ప్రధాన రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రహదారుల నిర్మాణాలకు సుమారు రూ.28.49 కోట్లు కేటాయించింది. ఈ రహదారుల నిర్మాణాలకు గురువారం స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేయనున్నారు.

రూ.16.8 కోట్లతో కోడూరు-అవనిగడ్డ రహదారి నిర్మాణం..

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పదికాలాల పాటు ఉండాల్సిన కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మించిన ఏడాదికే ధ్వంసం అయింది. కోడూరు నుంచి అవనిగడ్డ సుమారు 13 కిలో మీటర్ల మేర రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడి కంకరరాళ్లు పైకి లేవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 2022 అక్టోబర్‌లో అవనిగడ్డలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోడూరు-అవనిగడ్డ నూతన రహదారి నిర్మాణాన్ని కచ్చితంగా చేపడతామని ప్రకటించారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కోడూరు-అవనిగడ్డ రహదారికి రూ.16.8 కోట్ల నిధులు మంజూరు చేసింది.

పీఎంజీఎస్‌వై ద్వారా రూ.11.69 కోట్ల నిధులు..

- పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మరో మూడు రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.11.69 కోట్లు కేటాయించింది. అవనిగడ్డ మండలం మోదుమూడి నుంచి కోడూరు మండలం చినగుడుమోటు వరకు సుమారు పది కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణానికి రూ.4.8 కోట్లు కేటాయించింది.
- కోడూరు మండలంలోని మందపాకల-ఇరాలి గ్రామాలను కలుపుతూ లింకు రోడ్డు నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది. ఈ రహదారి నిర్మాణంతో తీరప్రాంత ప్రజలు మండల కేంద్రానికి దగ్గర మార్గంలో చేరుకోవచ్చు.
- నాగాయలంక మండలంలోని గణపేశ్వరం-పెదపాలెం గ్రామాలను కలుపుతూ రూ.3.09 కోట్లతో రహదారి నిర్మాణాలను ప్రారంభించనున్నారు.

మేలు జరిగిందని భావిస్తేనే ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



14వ డివిజన్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు, చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ కుటుంబంతో పాటు తమ ప్రాంతం అభివృద్ధి చెందటంతో పాటు మేలు జరిగిందని భావిస్తేనే మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నియోజకర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 14, 50, 35 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా చేసి చూపారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వంలో వారికి జరిగిన మేలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని సీఎంను కోరిన వెంటనే రూ.20 కోట్లను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో నియోజకవర్గంలో 75 పనులకు పైగా చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా 14వ డివిజన్‌లో రూ.40 లక్షలతో రెండు సీసీ రోడ్లు, 50 డివిజన్‌లో రూ.43 లక్షలతో, 35వ డివిజన్‌లో రూ.16.04 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు.

నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం ప్రాంతాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పోర్టు, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్ వంటి భారీ ప్రాజెక్టులను ఇచ్చి ఆయన ప్రేమను చాటుకున్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్లు కాగిత జవహర్‌లాల్‌నెహ్రూ, రాసంశెట్టి వాణిశ్రీ , భోగాది సాయిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మట్టా తులసి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు షేక్ ఇక్బాల్, కేశన నాని, షేక్ మొహమ్మద్ సాహెబ్, అన్వర్ హుస్సేన్, బూరగ రామారావు, గాజుల భగవాన్, మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



చిలకలపూడి(మచిలీపట్నం): దేశం సమగ్రంగా నడవాలంటే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని కోన గ్రామంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడుతూ చట్టాలను మనిషి రక్షణ కోసమే రూపొందించారన్నారు. చట్టానికి ప్రజలందరూ సమానమేనని రాజీమార్గం రాజమార్గంగా ఇరుపార్టీలు లబ్ధి పొందవచ్చునన్నారు. ఏ వ్యక్తి అన్యాయానికి గురికాకుండా ఉండేందుకు న్యాయవ్యవస్థ తోడుగా ఉంటుందన్నారు. ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, ఆర్ఐ యాకూబ్, న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా అడుగులు

బందరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు



నెలకుర్రులో పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తెలిపారు. బందరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత నెలకుర్రు గ్రామంలో సుమారు రూ.38 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న పీఏసీఎస్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఎస్.గొల్లపాలెంలో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సంపు, పైపు లైను నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెదయాదరలో మరో 3.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. మారుమూల గ్రామాలకు సైతం అన్ని సదుపాయాలు కల్పిస్తూ ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నెలకుర్రు బ్యాంకు అధ్యక్షుడు జడ్డు గోవిందరాజులు, వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జ్ సురేంద్ర, పెదయాదర గ్రామ ఇన్‌చార్జ్ అర్జా శంకర్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కంచర్లపల్లి విజయసారథి, ఎస్.గొల్లపాలెం సర్పంచ్ దేవానందం, తుమ్మలచెరువు ఇన్‌చార్జ్ తలుపుల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తలారి శ్రీనివాసరావు, చిన్నాపురం ఇన్‌చార్జ్ జంపాన సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభతో పులకించిన కోడూరు

- వైభవోపేతంగా సాగిన మహాసుదర్శన యాగం
- మహాపూర్ణాహుతిలో విశేషంగా పాల్గొన్న భక్తజనం
- కనులపండువగా జరిగిన వెంకన్న శాంతికల్యాణం



ప్రత్యేక అలంకారంలో కల్యాణ వెంకటేశ్వరుడు



సుదర్శన యాగ క్రతువును నిర్వహిస్తున్న పండితులు

కోడూరు:ఆధ్యాత్మిక శోభతో కోడూరు గ్రామం పులకించింది. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బుధవారం మహా సుదర్శన యాగాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్ల ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవను భక్తిప్రపత్తులతో జరిపారు. ప్రత్యేక పల్లకీలో దేవేరులను ఊరేగించుకుంటూ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 12 ప్రత్యేక హోమగుండాల ద్వారా మహా సుదర్శన యాగాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులతో పాటు మరో 24 మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి హోమ క్రతువును జరిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది రుత్వికుల పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా హోమాలు జరిగాయి. సుదర్శన యాగం నిర్వహించడం వల్ల లోకం సుభిక్షంగా ఉండడంతో పాటు రైతులు పాడిపంటలతో సమృద్ధి చెందుతారని పండితులు అనుగ్రహభాషణ చేశారు. భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

మహాపూర్ణాహుతితో పరవశించిన భక్తజనం..

యాగానికి సంబంధించిన మహా పూర్ణాహుతి సామగ్రితో ఉభయదాతలు మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం యాగక్రతువులో నిర్వహించిన మహాపూర్ణాహుతిని తిలకించిన భక్తులు పరవశించారు. హోమాల్లో నవధాన్యాలు వేసి భక్తిభావం చాటుకున్నారు. సుదర్శన యాగం విశిష్టతను వివరిస్తూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సుదర్శన యాగం అనంతరం స్వామివార్ల శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. యాగానికి ఉభయదాతలుగా వ్యవహరించిన దంపతులు ఈ కల్యాణానికి కూడా కర్తలుగా వ్యవహరించారు. ముందుగా గోపూజను నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు ఈ యాగంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా మల్లేశ్వరుని కల్యాణ మండపం ప్రారంభం

శాస్త్రోక్తంగా కలశ స్థాపన, శ్రీలక్ష్మీగణపతి, వాస్తు హోమం



టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలో కొలువై ఉన్న పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో దాత బండ్రెడ్డి భానోజీ రెడ్డి, నాగసాయిరామ్ దంపతులు సమకూర్చిన ఆర్థిక సౌజన్యంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని బుధవారం ప్రారంభించి కలశస్థాపన చేశారు. మండపం నిర్మాణం కోసం తల్లిదండ్రులు బండ్రెడ్డి వెంకట మాధవరావు, నాగేశ్వరి జ్ఞాపకార్థం దాత రూ.10 లక్షలు సమకూర్చారు. అంబా సాయి కిరణ్ శర్మ, ఘంటశాల పవన్ కుమార్‌శర్మ బ్రహ్మత్వంలో వేదపండితుల బృందం ఈ సందర్భంగా తొలుత శ్రీలక్ష్మీగణపతి హోమం, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం భానోజీ దంపతులతో శాస్త్రోక్త పూజలతో యంత్ర స్థాపన, కలశ స్థాపన చేయించారు. ఆలయ ట్రస్టీ బండ్రెడ్డి నాగిరెడ్డి, దాత కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శివరాత్రికి ఐలూరు ముస్తాబు



తోట్లవల్లూరు: దక్షిణ కాశీ ఐలూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే అశేష భక్తజనవాహిని కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా సుమారు లక్ష మందికి పైగా భక్తులు స్థానిక కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేయడంతో పాటు పితృదేవతలకు పిండ ప్రదానాల అనంతరం రామేశ్వరస్వామిని దర్శించుకుంటారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాలతో భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో బారికేడ్ల ఏర్పాటు, లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉయ్యూరు, మచిలీపట్నం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

నదిలో జల్లు స్నానాల ఏర్పాటు

కృష్ణానదిలో నీరు లేనందున ఎప్పటిలాగే అధికారులు జల్లు స్నానాలు ఏర్పాటు చేస్తున్నారు. నదీ తీరంలో నాలుగు బోర్లు వేయించి జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతకు అనుగుణంగా నీడ కోసం షామియానాలు, తాగునీటి కోసం ప్రత్యేకంగా ఏడు చేతి పంపులు సిద్ధం చేశారు. పుష్కరఘాట్ వద్ద, ఆలయం వద్ద ప్రత్యేక వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

గ్రామంలో నాలుగు రోజులుగా పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉయ్యూరు-ఐలూరు, కృష్ణాపురం-ఐలూరు మధ్య ప్రధాన రహదారుల వెంట ముళ్లపొదలను పంచాయతీ సిబ్బంది జేసీబీలతో తొలగిస్తున్నారు. పుష్కర ఘాట్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. తాగునీటి ట్యాంకు శుభ్రం చేయడంతో పాటు రహదారుల వెంట బ్లీచింగ్ చల్లిస్తున్నారు. ఆయా పనులను జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, ఆలయ ఈఓ జయశ్రీ పర్యవేక్షిస్తున్నారు.